సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



కాలుష్యం కాదు.. కాంతులు కావాలి
దీపావళిని పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ఈ పండగ కాలుష్య కారకం కాకూడదని పేర్కొంటున్నారు. -8లో



క్రికెట్ టోర్నీ ప్రారంభం
కడప నగరం వేదికగా ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. ఈ పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
33.2/25.4

వాతావరణం
జిల్లాలో మంగళవారం 25.4 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ..

- కార్యకర్తలు, నాయకుల కష్టసుఖాలు తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్
- ఏకపక్ష విధానాలు వీడండి.. పోలీసులకు హితబోధ
- ప్రభుత్వ అరాచకాలపై ప్రజలు తిరగబడాలి


ఇడుపులపాయలో వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్


వేంపల్లిలో అభిమానులకు అభివాదం తెలుపుతున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, కడప: ప్రజల బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ.. నేనున్నాను.. అంటూ వారికి భరోసాతో పాటు ధైర్యాన్ని ఇచ్చారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మంగళవారం బెంగళూరు నుంచి పులివెందుల చేరుకున్న ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇడుపులపాయలోని తండ్రి, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌కు చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. ముందుగా సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి మోకరిల్లి నాన్నను స్మరించుకున్నారు. సోదరుడు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి ఘాట్ వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడే వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పోలీసుల ఏకపక్ష చర్యలు మంచిది కాదు..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపైనా కక్షపూరిత రాజకీయాలు చేయలేదని.. ఇప్పుడు పార్టీ శ్రేణులపై అధికార పక్షం దాడులు చేస్తున్నా పోలీసులు ఏకపక్ష వైఖరి అవలంబించడం కరెక్టు కాదని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే అధికార పక్షానికి జై కొడితే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డిపై టీడీపీ నేతలు దారి కాచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నీరుగార్చారని వారి కుటుంబ సభ్యులు మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న సీఐ వెంకటరమణను పిలిపించి చట్టాన్ని కాపాడటంలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. చట్టానికి ఎవ్వరూ అతీతులు కాదని తెలియజెప్పాల్సిన బాధ్యత మీ వ్యవస్థపై ఉందని సూచించారు. రాజకీయ ప్రేరేపిత ఘటనలను అరికట్టడంలో వివక్ష ప్రదర్శించడం ఎంతమాత్రం మంచిది కాదని మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు.

పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలి..

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరుగుతున్నాయని.. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదని.. పద్ధతి మార్చుకోవాలని మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. కష్టాలు ఎల్లకాలం ఉండవని.. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని.. ప్రజలకు సంక్షేమం అందించకుండా సంక్షామం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

వేంపల్లెలో కాసేపు :

ఇడుపులపాయలో కార్యక్రమం అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్ నేరుగా వేంపల్లెకు చేరుకున్నారు.

ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు రుద్రా భాస్కర రెడ్డి కుమారుడు భరతసింహారెడ్డి వివాహం సుశాంతికతో జరిగింది. నూతన జంటను ఆయన ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. అనంతరం వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వేంపల్లెలో మాజీ జెడ్పీటీసీ షబ్బీర్ నూతన గృహ ప్రవేశానికి అప్పట్లో రాలేకపోయిన మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. వేంపల్లె, ఇడుపులపాయతోపాటు వేములలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

పులివెందులలో నాయకులతో మమేకం..

పులివెందులకు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నాయకులతో మమేకమయ్యారు. ప్రధానంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు కడప జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, డాక్టర్ సుధీర్‌రెడ్డిలతోపాటు మాజీ డైరెక్టర్లు, పలువురు నాయకులతో చర్చించారు.

కిక్కిరిసిన క్యాంపు కార్యాలయం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక సందర్భంగా ఇడుపులపాయతో పాటు పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయం ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. అంతకుముందు పులివెందులలో దారిపొడవునా తన కోసం ఎదురు చూస్తున్న కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు అభి వాదం చేస్తూ, ఆగి పలకరిస్తూ, వారి వినతులు స్వీకరిస్తూ జగన్ తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూడగానే ప్రజలు , అభిమానులు, కార్యకర్తలు.. ముఖ్యంగా యువత.. సీఎం.. సీఎం.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, ఇతర పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. ప్రజలకు సంబంధించి కష్టసుఖాలను అడిగి తెలుసుకోవడంతోపాటు పరిష్కారానికి చొరవ చూపారు. కొందరిని పేరు పేరునా ఆప్యాయంగా పలకరించడంతోపాటు ఇబ్బందులు పడిన వారిని ఆదుకుంటామన్నారు.


వేంపల్లిలో నూతన దంపతులు భరతసింహారెడ్డి, సుశాంతికలను ఆశీర్వదిస్తున్న వైఎస్ జగన్


వేంపల్లిలో మాజీ జెడ్పీటీసీ షబ్బీర్ నూతన గృహంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్ జగన్..


పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలు ఆలకిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్


ఇడుపులపాయ హెలీప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, అంజద్‌బాషా తదితరులు


ఎమ్మెల్సీ గంగుల


ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్


మాజీ ఎమ్మెల్యే గడికోట

న్యూస్‌రీల్

పెన్నాలో కొనసాగుతున్న వరద ఉధృతి


పెన్నానదిలో వరద నీరు

జమ్మలమడుగు: పెన్నానదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. గత రెండు రోజులుగా పెన్నానదిలోకి 12 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మంగళవారం గండికోట జలాశయం నుంచి 14వేల క్యూసెక్కుల నీరు మైలవరం ప్రాజెక్టులోకి వస్తున్నాయి. మైలవరం ఇరిగేషన్ అధికారులు పూర్తిగా ఆ నీటిని దిగువన వున్న పెన్నానదిలోకి విడుదల చేస్తున్నారు. మైలవరం జలాశయం పూర్తి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరంలో 6.1 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో వస్తున్న 14వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు డీఈ మూర్తి పేర్కొన్నారు.

ఇంటింటా నైపుణ్య గణన


మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి నైపుణ్య గణన నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ వినీల్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, నైపుణాభివృద్ధి సంస్థ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. దేశంలో మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య గణన చేపడుతోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ వివరాలను ఆధార్‌తో అనుసంధానిస్తామన్నారు. ఇందుకోసం నైపుణ్యం అనే ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. అమరావతి నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ బి.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సర్వే పూర్తయ్యాక విశ్లేషణ ఆధారంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

ఉన్నదెంత.. మిగిలినదెంత!

- హార్సిలీహిల్స్‌పై భూమి లెక్క తేల్చేందుకు చర్యలు
- డ్రోన్ సర్వే లెక్కల్లో తేడాతో మాన్యువల్‌గా రీ సర్వే
- వివిధ శాఖలకు 103 ఎకరాలు కేటాయింపు
- ఇక పక్కాగా తేలనున్న లెక్కలు


గవర్నర్ బంగ్లాను సర్వే చేస్తున్న సర్వేయర్లు



హార్సిలీహిల్స్ భూమి వివరాలు తెలిపే డ్రోన్ చిత్రం

బి.కొత్తకోట: రాష్ట్రంలో ఏకైక పర్వత నివాస ప్రాంతం హార్సిలీహిల్స్. ఈ చల్లటి కొండపై భూమి ఎంతుంది, ఎవరికెన్ని ఎకరాలు కేటాయించారు, ఇంకా ఎంత భూమి ఖాళీగా ఉంది. కొండపై నిర్మాణాలు, కేటాయించిన భూమి వినియోగం ఇలా అన్ని రకాల వివరాలు సేకరించేందుకు గతంలో డ్రోన్ ద్వారా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించగా భూ లెక్కల్లో తేడాలు వచ్చాయి. దీంతో సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా సర్వే శాఖ ఆదేశాలతో ఏడుగురు సర్వేయర్లు రంగంలోకి దిగారు. కొండపై రెండో రోజు మంగళవారం సర్వే కొనసాగింది. సముద్రమట్టానికి 1,256.53 మీటర్ల (4,141అడుగులు) ఎత్తులోని ఈ కొండ బి.కొత్తకోట మండలం కోటావూరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఉంది. ఒకప్పుడు ఈ కొండ దట్టమైన అటవీప్రాంతం, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరారేది. బ్రిటీష్ పాలకులు కొండను వేసవి విడిది కేంద్రంగా మార్చడంతో నివాసాలు ఏర్పడుతూ వచ్చాయి. రెవెన్యూ శాఖకు కొండపై సెంటు భూమిలేదు. మొత్తం అటవీ రిజర్వ్ ప్రాంతం కావడంతో.. అటవీశాఖ రెవెన్యూకు భూమి బదలాయించింది.

103 ఎకరాలు అటవీశాఖ ఇచ్చిందే

కొండపై రెవెన్యూశాఖకు భూమి లేకపోవడంతో 103 ఎకరాల భూమిని కేటాయించేందుకు అప్పటి మద్రాసు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూమిని అటవీప్రాంతం నుంచి మినహాయించి రెవెన్యూశాఖకు కేటాయిస్తూ 1959 ఏప్రిల్ 15న నంబర్ 101523/సీ1/58-5 ద్వారా ఉత్తర్వు జారీ చేసింది. ఈ భూమిని సర్వే నంబర్ 538 బ్లాకు నుంచి వేరు చేస్తూ 1959 జూలై 25న రెవెన్యూ శాఖకు అధికారికంగా అప్పగించారు. తర్వాత కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కలెక్టర్ డబ్ల్యూహెచ్ హార్సిలీ అభ్యర్థనపై మద్రాసు ప్రభుత్వం అటవీప్రాంతంతో నిండిన కొండపై అతిథిగృహం నిర్మించుకోవడానికి 1869 మే 4న జీవోఎంఎస్ నంబర్ 11579 జారీ చేసింది. కొండపై ఇదే తొలి నిర్మాణం.

శాఖలకు కేటాయించుకుంటూ..

వివిధ శాఖలు కోరగానే గత ప్రభుత్వాలు భూములు కేటాయించుకుంటూ పోయాయి. కొండపై నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు, భూమి విస్తీర్ణం, అందుబాటులోని వనరుల గురించి ఏమాత్రం ఆలోచించకుండా ఇచ్చుకొంటూ వెళ్లారు. 103 ఎకరాల భూమిలో సహకార గృహనిర్మాణ సంఘానికి 20.6 ఎకరాలు పోగా అత్యధికంగా పర్యాటక శాఖకు 24.38 ఎకరాలు ఇవ్వగా మరికొంత భూమిని వినియోగించుకుంటోంది. క్రీడా ప్రాంగణానికి 3.74 ఎకరాలు కేటాయించగా 9.20 ఎకరాలు రోడ్డుకు 56 అడుగులలోతు వల్ల ఖాళీగా ఉంచారు. 33.03 ఎకరాలు కొండకు ఏటవాలుగా ఉన్నందున రోడ్డుకు వదిలారు (ఇందులోనూ కేటాయింపులు చేశారు). ఇవికాక పోలీసు, రైల్వే, మొబైల్ టవర్లు, బీఎస్ఎన్ఎల్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సీడీసీఎంఎస్, పోస్టాఫీసు.. ఇలా శాఖలకు భూమిని కేటాయించారు. ఇక మిగిలింది చాలా తక్కువ భూమి కావడంతో దీనిపై కచ్చితమైన లెక్కలు తీయాలని చర్యలు చేపట్టారు.

టూరిజం ద్వారా ఒబెరాయ్‌కు

కొండపై ఒబెరాయ్ సంస్థకు 20.53 ఎకరాల భూమిని కేటాయించగా దాన్ని నేరుగా ప్రభుత్వం నుంచి అప్పగించకుండా టూరిజం శాఖ ద్వారా అప్పగించేలా చర్యలు జరుగుతున్నాయి. ఈ భూమిని రెవెన్యూ లెక్కల్లో టూరిజంకు మ్యూటేషన్ చేశాక ఒబెరాయ్‌కు అధికారికంగా అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. దీనితో ఒబెరాయ్‌కు ఇచ్చే ముందు ఈ భూమి టూరిజంకు కేటాయించినట్టు.. ఈ శాఖ నుంచి ఒబెరాయ్‌కు అప్పగిస్తారు.

1972లో తొలి సర్వే..

హార్సిలీహిల్స్‌పై ఉన్నది 103 ఎకరాల భూమిపై పలుమార్లు సర్వేలు జరిపారు. దశాబ్దకాలంలో నాలుగుసార్లు సర్వే జరిపింది రెవెన్యూ శాఖ. గత ఐదేళ్లలో రెండు సార్లు సర్వే చేసి నివేదికలు ఇచ్చారు. ఒకసారి డ్రోన్ సర్వే కూడా జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేసిన కలెక్టర్లు సర్వేలను ప్రత్యేకంగా జరిపించారు. ప్రస్తుతం ఎన్ని సర్వేలు జరిపినా మొదట సర్వే జరిగింది మాత్రం 1972లో. అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా సర్వే అధికారులు, సిబ్బందిని పంపించింది. అప్పట్లో ఈ సర్వే రెండు నెలలు జరిగింది. ఈ సర్వేతో సిద్ధం చేసిన రికార్డులే ఇప్పటి సర్వేయర్లకు ఆధారం. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే ఐదు రోజులు పాటు సాగనుంది. ఇప్పటికే రెండు రోజులు పూర్తికావడంతో మరో మూడు రోజులపాటు సర్వే నిర్వహించి పూర్తి నివేదికను సిద్ధం చే యనున్నారు.

నేడు దస్తగిరమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం

బద్వేలు అర్బన్: ఇటీవల ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబ సభ్యులకు బుధవారం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 23న దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో పాటు రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. ఆ మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని రామాంజనేయనగర్‌లో గల దస్తగిరమ్మ ఇంటి వద్ద ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు చెక్కును అందజేస్తామని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తెలిపారు.

కేఎంసీకి అవార్డు


అవార్డును అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని నగర పాలక సంస్థలో పటిష్టంగా అమలు చేసినందుకు కడప మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)కు అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదాన ఉత్సవంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి ఈ అవార్డును మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ చేతుల మీదుగా అందుకున్నారు వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారు వ్యాపారం చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంలో కృషికి గాను ఈ అవార్డు లభించింది.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ మీటింగ్ హాలులో వయోజన విద్యా శాఖ డీడీ ఎంపీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పథకం కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలో100 శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి అక్షరాస్యతను అందించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్యను వలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథక లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలలోని నిరక్షరాస్యులను గుర్తించడానికి జిల్లాలో 23,170 మంది నిరక్షరాస్యులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్వాడి ఆయాలు, హెల్పర్స్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్ మన్ లు తదితరులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ పథకం ద్వారా గుర్తించబడిన నిరక్షరాస్యులను నవంబర్ 5వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య,నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాలు కమ్యూనిటీ కేంద్రాలలో ఆరు నెలల పాటు సాయంత్రం వేళల్లో శిక్షణా తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్ నాయక్, శ్రీలక్ష్మి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. శిక్షణా తరగతిని సెర్ప్ నుండి వచ్చిన ఆంజనేయులు, రెడ్డయ్య లు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, వయోజన విద్యా సిబ్బంది, ఏపీఎంఎస్ లు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి

కడప సెవెన్‌రోడ్స్: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 ఆశయ సాధనలో భాగంగా ఐదేళ్ల (2024-29) జిల్లా విజన్ ప్లాన్ లక్ష్యాన్ని ఛేదించేందుకు కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విజన్ ప్రణాళిక రూపకల్పన కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై ఆమె డీఆర్వో గంగాధర్‌గౌడ్ తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం, అటవీ శాఖ, సోషల్ ఫారెస్ట్రీ, ఉద్యాన, పశు సంవర్థక, మత్స్య శాఖ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ, హౌసింగ్, హ్యాండ్‌లూమ్స్, విద్యా, వైద్య శాఖలు, ఐసీడీఎస్ డ్వామా, డీఆర్డీఏ, ఆర్అండ్‌బీ, విద్యుత్, గ్యాస్, మైనింగ్, టూరిజం, టెంపుల్ టూరిజం, పరిశ్రమల శాఖ తదితర శాఖల్లో కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై సంబంధిత అధికారులతో లక్ష్య సాధన, పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ వెంకటపతి, సీపీవో వెంకట్రావు, డీఎఫ్ఓ శివ కుమార్, డీపీఓ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

32 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్ఐ హనుమంతు

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లికి చెందిన హుసేనయ్య వద్ద 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న అన్వర్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కృష్ణాపురం రైలు మార్గంలోని ఎగువ రైలు పట్టాలపై షేక్ అన్వర్‌బాషా (62) ఆత్మహత్య చేసుకున్నట్లు కడప రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణు గోపాల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రామాపురం మండలం హసనాపురం గ్రామానికి చెందిన అన్వర్‌బాషా అప్పుల బాధ తాళలేక మంగళవారం మధ్యాహ్నం ముంబయి–చెన్నై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతి చెందిన రాజశేఖర్



సుబ్బరాయుడును చికిత్స కోసం తరలిస్తున్న కుటుంబ సభ్యులు

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. విప్రొద్దుటూరుకు చెందిన కాటం రాజశేఖర్(52) సోమవారం రాత్రి అగస్తలింగాయపల్లెలో జరుగుతున్న తమ బంధువుల మర్లుపెళ్లికి వచ్చాడు. అనంతరం తిరిగి ప్రొద్దుటూరుకు నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో నల్లింగాయపల్లెకు చెందిన యం.సుబ్బరాయుడు(19) తన బైక్‌లో వస్తూ రాజశేఖర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయుడుకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ సుబ్బరాయుడు కూడా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

రాయచోటి : పోలీసుల పిల్లలు, విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభిప్రాయపడ్డారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు.

కాలుష్యం కాదు.. కాంతులు కావాలి

పండగ అంటే ఆనందం...అన్ని కష్టాలు మరిచి ఆ రోజంతా ఆనందంగా, ఆహ్లాదంగా గడిపేందుకే పెద్దలు ఈ పండగను నిర్ణయించారు. కానీ మితిమీరిన ఉత్సాహంతో ఆనందాన్ని.. తీవ్ర ఆవేదనగా మార్చవద్దని, మరో ఏడాదిపాటు మరవలేని తీపి గుర్తుగా నిర్వహించుకోవాలని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సూచించింది. ఈ సందర్భంగా న్యాయస్థాన సూచనలు, నిర్వహించుకోవాల్సిన పద్ధతులపై కథనం.

- హరిత దీపావళిగా భావించాలని సుప్రీంకోర్టు సూచన



కడప నగరంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

కడప కల్చరల్ : దీపావళి పండగ నిర్వహణలో ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉండడం గమనార్హం. అలాగాక అన్ని జాగ్రత్తలు తీసుకుని ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించేందుకు ఈ పండగను పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలన్నది న్యాయ కోవిదులు, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. వయో బేధం లేకుండా నిర్వహించుకుంటున్నా.. కొందరి అత్యుత్సాహం, నిర్లక్ష్యం వల్ల ఈ ఆనందం దుంఖఃగా మారుతోంది. ఈ పండగ కాలుష్య కారకం కాకూడదని దీపావళి కాంతులు మాత్రమే చాలునని పేర్కొంటున్నారు. పర్యావరణ నిపుణులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా గ్రీన్ దీపావళి నిర్వహించాలని కోర్టు సూచించింది. ఇటీవల ఈ అంశంపై కోర్టు తన సూచనలను పునఃసమీక్షించింది. పండుగ రోజున కాల్చే టపాసుల ద్వారా వచ్చే కాలుష్యం ప్రమాదకరమైందని, ఇకపై కాలుష్యాన్ని కలిగించే టపాసులను వినియోగించకూడదని చెప్పింది. భారీ శబ్దాలు చేసే వాటిని దూరంగా ఉంచాలని తెలిపింది. రాత్రి 8 గంటలనుంచి 10గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చాలని తీర్పులో ఆదేశించింది. అయితే దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులు గమనించి రోజులో ఏవైనా రెండు గంటలపాటు కాల్చుకోవచ్చునని సడలింపు ఇచ్చింది.

ఇలాగైతే సురక్షితం

ఈ దీపావళికి పర్యావరణ హితమైన టపాసులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. ది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఆఫ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ ఏకో ఫ్రెండ్లీ గ్రీన్ టపాసులను అందుబాటులోకి తెచ్చింది. భారీ శబ్దాల స్థానంలో ఫ్లవర్ పాట్స్, పెన్సిల్స్, భూ చక్రాలు, స్పార్కులర్‌ల స్థానంలో కాకరొత్తులు, చిచ్చుబుడ్లు మాత్రమే కాల్చుకోవాలని పలువురు సూచిస్తున్నారు. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుద్దీపాలను వెలిగించడం మంచిదని.. నెయ్యి దీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుందని పెద్దలు సూచిస్తున్నారు. టపాసులు ఇళ్ల లోపల కాల్చితే విష వాయువులు మూలల్లో నిలిచి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. సగం కాలిన టపాసులను వదిలేయాలని, మరోసారి కాల్చుదామని దగ్గరికి వెళితే ఆకస్మాత్తుగా పేలే ప్రమాదం ఉందని అగ్నిమాపక అధికారులు హెచ్చరిస్తున్నారు. కాటన్ దుస్తులు, కళ్లజోడులు, బూట్లు వేసుకోవడం మంచిదని చెబుతున్నారు.

ప్రమాదాలుంటాయి జాగ్రత్త

పండగ సంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చుకుంటాం. కానీ ఆదమరిస్తే ఆ సరదా మనకే శాపంగా మారే ప్రమాదం ఉంది. పూర్తిగా విషపూరితమైన వాటిని కాల్చితే మన ప్రమాదాన్ని మనమే సృష్టించుకున్నట్లు ఉంటుంది. ఈ టపాసుల తయారీలో వాడే రసాయనాలు, లోహాలు విషపూరితమైనవి. పలు రసాయనాల సమ్మేళనంతో చేసిన వీటిని కాల్చితే గాలి, శబ్ద కాలుష్యం పెరుగుతుంది. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ ఏడాది పెద్ద నగరాల్లో శబ్ద, వాయు కాలుష్యాన్ని లెక్కగట్టనున్నారు. వారు పర్యావరణ హిత దీపావళిని జరుపుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

అనుమతించే శబ్ద కాలుష్యం		
జోన్	పగలు	రాత్రి
ఇండస్ట్రియల్ జోన్	73	70
కమర్షియల్ జోన్	65	55
రెసిడెన్షియల్ జోన్	55	45
సైలెన్స్ జోన్	50	50

నిబంధనల మేరకే..

ప్రభుత్వ నిబంధనల మేరకే వాయు, శబ్ద కాలుష్యాలు ఉండాలని, అంతకుమించితే శిక్ష తప్పదని సంబంధిత శాఖలు హెచ్చరిస్తున్నాయి. నగర పరిధిలో ఏ మేరకు ఈ కాలుష్యం ఉండవచ్చునో వారు ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్నారు.

జాగ్రత్తలతో దీపావళి చేసుకోవాలి

తగిన జాగ్రత్తలు తీసుకుంటే దీపావళి పండుగ ఆనందాన్ని కుటుంబాలు ఆస్వాదించవచ్చు. మన ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండేలా పండగ నిర్వహించుకోవాలి. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి.



\- గునిశెట్టి సాయికుమార్, కడప

ప్రమాదాలు లేని పండగ కావాలి

ఈ పండగ అంటే సంతోషం. టపాసులు కాల్చడం ఇందులో భాగం. ఇంటిల్లిపాదీ తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆనందం మన సొంతమవుతుంది. మన సంతోషం ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చూసుకోవాలి.



\- కె.కృష్ణంరాజు, కడప

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌గాను, స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లను చేపట్టినట్లు డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన టెంటేటివ్ సీనియారిటీ జాబితాను కడప జిల్లా విద్యాశాఖాధికారి అధికారిక వెబ్‌సైట్ www.kadapa.deo.in లో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రాత పూర్వకంగా తగిన ఆధారాలతో డీఈఓ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని డీఈఓ మీనాక్షి కోరారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ

గుర్రంకొండ : రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. నంద్యాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. అండర్–17 ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో పాల్గొన్న కె.ప్రసన్నకుమార్ కాంస్య పతకం సాధించారు. అండర్–14 పోటీల్లో హరినాథ్, ముజాహిద్ కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం జరిగిన అభినందన సభలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ చింతిర్ల రమేష్, తదితరులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. రవీంద్ర, హర్షవర్ధన్ రెడ్డి, త్రినాథ్, రెడ్డిమోహన్, మదన్ మోహన్, ఉషారాణి, ప్రశాంతి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో స్టేషన్ ఎస్‌ఐలు, రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నాణ్యత, ఖచ్చితత్వంతో సమాచారం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు వచ్చే ఫిర్యాదును విచారించాలన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే మెమోలకు సమాధానం సమగ్రంగా ఉండేలా చూడాలన్నారు. రోజువారీ డీఎస్ఆర్‌లో ఏ వివరాలు పొందుపరచాలో సిబ్బందికి వివరించారు. కృత్రిమ మేధను వినియోగించుకుని అతి తక్కువ సమయంలో నాణ్యతతో కూడిన సమాచారాన్ని ఎలా అందించాలో ఎస్పీ ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.భాస్కర్‌రెడ్డి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమార్ రెడ్డి, ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య, డీటీఆర్‌బీ సీఐ మహమ్మద్‌బాబా, చెన్నూరు సీఐ పురుషోత్తం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీల పేరిట వినియోగదారులపై భారం



మాట్లాడుతున్న కామనూరు శ్రీనువాసులు రెడ్డి

కమలాపురం : కూటమి ప్రభుత్వం విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేరిట వినియోగదారులపై భారం వేయడం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులు రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక క్రాస్ రోడ్డులో జరిగిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్తు భారాలను తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు పాలన చేపట్టిన ఐదు నెలలకే సర్దుబాటు చార్జీల పేరిట రూ.6072 కోట్ల భారం మోపడం దారుణం అన్నారు. 2026 నవంబర్ వరకు యూనిట్ పై రూ 0.83 పైసలు అదనంగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం సరి కాదన్నారు. ప్రజలపై వేసిన ట్రూ అప్ చార్జీల భారాన్ని తగ్గించాలన్నారు. నిత్యావసరాల ధరలు మండుతుంటే మరో పక్క విద్యుత్ చార్జీలు పెంచడం సమంజసం కాదన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మీదేవి, రమేష్, రాజేష్, ముక్తియార్, దాదాపీర్, శ్రీనివాసులు, ఇమ్రాన్, మహ్మద్ పాల్గొన్నారు.

భూమి కోసం సమరశీల పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా వ్యాప్తంగా దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలకు రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ భూమి మంజూరు చేయడంలేదన్నారు. కొందరు బినామీ పేర్లతో వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని ఎస్టేట్స్ కట్టుకుంటున్నారని ఆరోపించారు. పేదవాడికి ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఆర్డీవో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇమ్మానుయేల్, మునెయ్య, వెంకటరమణ, వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ ప్రారంభం



5 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ దేవాన్ష్ రోహిత్



5 వికెట్లు తీసిన విజయనగరం బౌలర్ శ్రీచరణ్



124 పరుగులు చేసిన శ్రీకాకుళం బ్యాట్స్‌మన్ జోగేంద్ర

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. వైఎస్ఆర్‌ఆర్– ఏసీఏ మైదానంలో విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 89 ఓవర్లలో 336 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వివేక్ నంద 61, జోగేంద్ర 124 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. విజయనగరం బౌలర్ శ్రీచరణ్ 5 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణ, గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు 63 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అభినవ్ డేవిడ్ 30, కౌశిక్ 28 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు చరణ్ గణేష్ 3, భాను చైతన్య 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 28.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 80 పరుగులు చేసింది. జట్టులోని భానుచంద్‌యాదవ్ 42 పరుగులతో క్రీజులో నిలిచాడు.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 60.1 ఓవర్లలో 264 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సూర్య ప్రకాష్ 49, సుశాంత్ 75 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు దేవాన్ష్ రోహిత్ 5, లిఖిత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. జట్టులోని ఆదినారాయణరెడ్డి 45 పరుగులు, ప్రణధీర్ 24 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు లీలావికాస్ 3, సుశాంత్ 2 వికెట్లు తీశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

గుర్రంకొండ : గుర్రంకొండ సమీపంలోని శ్రీవోనీ ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చొరబడి స్వామికి అలంకరించిన ప్రభవలను ధ్వంసం చేశారు. లక్ష రూపాయల విలువ చేసే వస్తువులను దోచుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి సమీపంలోని గుర్రంకొండ–సంగసముద్రం మార్గంలో పురాతన వోనీ ఆంజనేయస్వామి ఉంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి ఆలయం గేట్లు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. స్వామికి అలంకరించిన ప్రభవను రాడ్లతో ధ్వంసం చేశారు. గంట, హారతి, ఇతర పూజా సామగ్రి, వస్తువులు బయటికి తెచ్చి ధ్వంసం చేశారు. కార్యాలయ గది తాళాలు పగలగొట్టి.. అందులోని బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. పక్కనే వ్యవసాయం చేసుకొంటున్న రైతులు ఆలయంలో అలికిడి విని కేకలు వేయగా దుండగులు ఆ వస్తువులు పడేసి పరారయ్యారు. గత పది రోజుల్లోనే రెండు ఆంజనేయస్వామి ఆలయాలను దుండగులు ధ్వంసం చేయడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ మధురామచంద్రుడు, సిబ్బంది చేరుకుని చోరీ జరిగిన ప్రాంతం, ధ్వంసమైన వస్తువులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై రాయితో దాడి

మదనపల్లె : వ్యక్తిపై రాయితో దాడి చేసిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు...నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులు రెడ్డి (54) ఇంటి సమీపంలో ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు వేసేందుకు దారి స్థలాన్ని చదును చేస్తుండగా శ్రీనివాసులురెడ్డి అక్కడే ఉన్నాడు. చదువు చేసిన మట్టి పక్కనున్న సిద్దల చిన్నపరెడ్డి స్థలంలో పడటంతో, అప్పటికే రోడ్డు నిర్మాణంపై వ్యతిరేకతతో ఉన్న చిన్నపరెడ్డి ఆవేశానికి లోనై రాయితో శ్రీనివాసులురెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో శ్రీనివాసులురెడ్డి తలకు తీవ్రంగా గాయం కాగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సనాతన ధర్మం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : సనాతన ధర్మం పేరుతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ కొన్ని పార్టీలు వివాదాలకు తెరతీస్తున్నాయని పలు సంఘాల నేతలు, వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) కార్యాలయంలో సమాజానికి ఏది అవసరం? సనాతన ధర్మమా? లౌకికవాద రాజ్యాంగమా? అంశంపై మంగళవారం చర్చాగోష్టి జరిగింది. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ పేరిట వివాదాలను రేకెత్తించి, రాజకీయలబ్ధి పొందాలనుకునే నాయకులకు తగు రీతిలో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలో సనాతన ధర్మం ప్రస్తావన లేదని, లౌకిక వాదంతో సమానత్వాన్ని మాత్రమే రాజ్యాంగ నిర్మాతలు ఉద్బోధించారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సనాతన ధర్మానికి వక్రభాష్యం చెబుతూ హిందూ మతాన్ని కొన్ని పార్టీల నాయకులు అప్రతిష్ఠ పాలు చేస్తున్నారని, అధికారాన్ని అనుభవించడానికి హిందూ ధర్మాన్ని వాడుకోవడం ఆక్షేపనీయం అన్నారు. ప్రజల్లో కుల, మత విభజనకు చేస్తున్న కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలంటూ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉపన్యసించడం దురదృష్టకరం అన్నారు. మణిపూర్ ఘర్షణల్లో మహిళను నగ్నంగా ఊరేగించిన రోజున పవన్‌కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరికుమార్, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు క్రిష్ణప్ప, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రవి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, కదిరయ్య, రామాంజనేయులు, రంగారెడ్డి, సుమిత్రమ్మ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య భూ వివాదం



పట్టా భూమిలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు

గాలివీడు : భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంఘటన మంగళవారం గాలివీడులో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గేట్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ఇటీవల రహదారి విస్తరణకు అక్రమ నిర్మాణాలు తొలగించారు. అనంతరం సర్వే నెంబర్–2266లో 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వం ఆర్అండ్‌బీకి అప్పగించింది. ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలి విస్తరణ పనులు జరుగుతుండగా, స్థానికులు కొందరు ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమించి రేకుల షెడ్లు ఏర్పాటుచేశారు. ఆ రేకుల షెడ్ల వెనుక భాగం తమ అనుభవంలో ఉందని కొందరు ముస్లింలు కొంత స్థలం చుట్టూ రేకులువేశారు. ఇదిలా ఉంటే అది తమ పట్టా భూమి అంటూ ఇంకో వర్గం వారు రేకులను తొలగించారు. అన్ని వర్గాల వారు మంగళవారం ఒక చోట చేరి వివాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ నాయకుల అండతో తమ పట్టా భూమిలో షెడ్లు వేశారని భూ యజమాని, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దారు భాగ్యలత వివరణ కోరగా ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామని, హద్దులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య వివరణ ఇస్తూ ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని తెలిపారు. నాలుగురోడ్ల కూడలిలోని సర్వే నెంబర్ 2266లో ఆర్అండ్‌బీ స్థలంలో సర్వే చేశామని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ స్థలం ఆక్రమణకు గురైందో గుర్తించి స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నందు ఉన్న డీఏవీ స్కూల్‌లో చదువుతున్న రాఘవరాణా (8వతరగతి), హరితరెడ్డి (9వ తరగతి) జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గుప్తా, వ్యాయామోపాధ్యాయుడు నరేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 25 నుంచి శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబరు 3వ వారంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో వారు పాల్గొంటారని సెక్రటరి నరేంద్ర తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



విజేతగా నిలిచిన కడప జిల్లా బాలుర జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు బాలికల జట్టు

రాయచోటి టౌన్ : రాష్ట్ర స్థాయి అండర్–17 బాల, బాలికల కబడ్డీ పోటీలు మంగళవారం హోరా హోరీగా సాగాయి. రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలుర విభాగంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో అనంతపురం జట్టుపై కడప జట్టు 14 పాయింట్లు అధికంగా సాధించి విజేతగా నిలవగా అనంతపురం జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. కర్నూలు జిల్లా జట్టు తృతీయ, చిత్తూరు జట్టు నాలుగో స్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగంలో..

మంగళవారం జరిగిన కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుపై మూడు పాయింట్ల ఆధిక్యంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. శ్రీకాకుళం జట్టు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ, కృష్ణా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి.

బాబాయిని కత్తితో పొడిచిన అబ్బాయి



రమేష్ (ఫైల్)

పీలేరు : పిల్లల ఆలనా పాలనా చూసుకోవాల్సిన బాబాయి.. మద్యం తాగి రోజూ వేధిస్తుండడంతో ఆయన అన్న కుమారుడు కత్తితో పొడిచి చంపిన సంఘటన సోమవారం రాత్రి అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. పట్టణం లోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన రవి, రమేష్ అన్నదమ్ములు. రవి, అతడి భార్య షర్మిల బెంగళూరులో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. రవి కుమారుడు (14) వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బాబాయ్ రమేష్(35)తో కలిసి ఇంటి వద్ద నివసిస్తున్నాడు. రమేష్ కూలి పనులకు వెళ్తూ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి వచ్చి మైనర్ బాలుడిని నిత్యం కొడుతూ వేధింపులకు గురిచేశాడు. సోమవారం రాత్రి మరోసారి గొడవకు దిగి వేధిస్తుండడంతో మైనర్ బాలుడు ఆగ్రహంతో ఇంట్లో కూరగాయలు తరిగే కత్తితో అతడిని పొడిచేశాడు. రమేష్ రక్తపు మడుగులో పడి ఉండటం గమనించి 108కు సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికే మృతి చెందాడు. సీఐ ప్రసాద్‌బాబు కేసు నమోదు చేశారు.